క్లుప్తంగా

సద్గురు తులసీరామ్ జన్మదిన వేడుకలు



పూజలు చేస్తున్న భక్తులు

కౌటాల: మండలంలోని గుండాయిపేట గ్రామంలోని హనుమాన్ ఆలయంలో ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో సద్గురు తులసీరామ్ మహరాజ్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా మహరాజ్ పల్లకిని గ్రామంలో ఊరేగించారు. దీంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. అనంతరం మహరాజ్ చిత్రపటానికి పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు గురుడుపేటకు ఎమ్మెల్యే రాక

కౌటాల: మండలంలోని గురుడుపేట గ్రామంలో సోమవారం సిర్పూర్(టి) ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పర్యటించనున్నట్లు రైతుబంధు సమితి మండల కన్వీనర్ మెర్పల్లి బ్రహ్మయ్య ఆదివారం తెలిపారు. సోమవారం గ్రామ పంచాయతీ పరిధిలోని పలు రోడ్ల నిర్మాణానికి ఆయన భూమిపూజ చేస్తారన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు గ్రామంలో సభ ఉంటుందని, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సభకు సకాలంలో హాజరు కావాలని కోరారు.

'టీఎల్ఎం మేళా'లో పాల్గొనాలి

కెరమెరి: ఈ నెల 3న మండలంలోని కెరమెరి ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించనున్న టీఎల్ఎం మేళాలో ప్రభుత్వ పాఠశాలలు పాల్గొనాలని మండల విద్యాధికారి కుడ్మెత సుధాకర్, ఎంఎస్‌వో ఆడే ప్రకాశ్, గోయగాం కాంప్లెక్స్ హెచ్ఎం ఎన్. రమేశ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మేళాలో విజేతలకు బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు. ఉదయం 11 గంటలలోపు పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. కార్యక్రమానికి డీఈవో, ఇతర జిల్లా అధికారులు హాజరవుతున్నట్లు తెలిపారు.

శబరిమల యాత్రకు తరలిన స్వాములు



శబరిమలకు తరలివెళ్తున్న స్వాములు

ఆసిఫాబాద్అర్బన్: అయ్యప్పస్వామి దీక్షాపరులు ఆదివారం జిల్లా కేంద్రం నుంచి రైలులో శబరిమలకు తరలివెళ్లారు. అయ్యప్ప ఆలయంలో గురుస్వామి ఆధ్వర్యంలో శబరియాత్రకు వెళ్లే స్వాములకు ఇరుముడులు కట్టించి, స్వామికి అభిషేకంతో పాటు శరణుఘోష చేయించారు. స్వాములు రమేష్, మోహన్, ఖాండ్రె విశాల్, రాజు, చిరంజీవి, కిరణ్, తదితరులు ఉన్నారు.

కబడ్డీ టోర్నమెంట్ ప్రారంభం



పోటీలు ప్రారంభిస్తున్న నాయకులు

చింతలమానెపల్లి: మండలంలోని డబ్బా గ్రామ పంచాయతీ పరిధిలోని బారెగూడ గ్రామంలో పూలే సేవ సమితి యూత్ ఆధ్వర్యంలో నిర్వహించే కబడ్డీ టోర్నమెంట్‌ను ఆదివారం ఎంపీపీ డుబ్బుల నానయ్య ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత యువకులు క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు డుబ్బుల వెంకయ్య, రషీద్, నికోడే బాపురావు, గుర్లే శ్రీనివాస్ పాల్గొన్నారు.

'భీమా కోరేగావ్' పోరాటాలకు స్ఫూర్తి



నివాళులర్పిస్తున్న నాయకులు

రెబ్బెన: భీమా కోరేగావ్ సూర్య దివస్ స్వాభిమాన పోరాటాలకు స్ఫూర్తి అని వంకులం గ్రామ మహర్ అధ్యక్షుడు చునార్కర్ శంకర్ అన్నారు. ఆదివారం మండలంలోని వంకులంలో మహా కోరేగావ్ శౌర్య దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆరెకుల సంఘం అధ్యక్షుడు పాలె వెంకటి, నాయకులు రాథోడ్ బాబురావు అజ్మీర మురళీ, కోట సోమయ్య, డీవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు సతీష్ పాల్గొన్నారు.

మురుగుతో పరేషాన్



పూర్తవకుండా వదిలేసిన పాత డ్రైయినేజీ

- రూ.3 లక్షలతో డ్రెయినేజీల నిర్మాణం
- ఇష్టారీతిన నిర్మించడంతో నిలుస్తున్న మురుగు నీరు
- ఇబ్బందులు పడుతున్న ఇంద్రనగర్ కాలనీవాసులు



కాలువలో నిలిచిన మురుగు నీరు

వాంకిడి: మండల కేంద్రంలోని ఇంద్రానగర్ కాలనీలో ఇటీవల రూ.3 లక్షల గ్రామపంచాయతీ నిధులతో 120మీటర్ల మురికి కాలువల నిర్మాణం చేపట్టారు. నిర్మాణ దశలో అధికారులు పర్యవేక్షణ కరువవడంతో కాంట్రాక్టర్ ఇష్టారీతిగా పనులు కానిచ్చేశాడు. దీంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. కాలువ నిర్మాణం చేపట్టే క్రమంలో మురుగు నీరు ఎటు వెళ్లాలనేది చూసుకోకుండానే నిర్మించారంటే ఇంజనీరు పనితనం, అధికారుల పర్యవేక్షణ ఏంటనేది తెలుస్తుంది. ఇంజనీరింగ్ నమూనా విధానంతో కాకుండా కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా నిర్మించాడని కాలనీవాసులు పేర్కొంటున్నారు. కాలువ నిర్మాణ అనంతరం అడుగు భాగంలో ఫ్లోరింగ్ పనులు కూడా చేపట్టకుండానే వదిలేశారు. దీంతో భవిష్యత్తులో కాలువలోని చెత్తచెదారం తొలగించాలంటే ఇబ్బందులు పడక తప్పదు. మండల కేంద్రంలో ఇప్పటికే నాలుగు వరసల రహదారి పనులతో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. దీనికి తోడు నూతనంగా చేపడుతున్న పనులైనా భవిష్యత్తు ప్రణాళికతో చేపట్టాలని మండల వాసులు కోరుతున్నారు. ఈ సమస్యపై చరవాణి ద్వారా ఏఈ శైలేందర్‌ను వివరణ కోరగా పనులు సక్రమంగానే చేపట్టామని, పనుల్లో ఏమైనా అవకతవకలు ఉంటే పర్యవేక్షించి సంబంధిత కాంట్రాక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు.

నాసిరకంగా పనులు



కాలువ నిర్మాణంలో నాసిరకం ప్రమాణాలు పాటించారు. ఇంజనీరింగ్ విధానం ప్రకారం కాకుండా గుత్తేదారు ఇష్టారాజ్యంగా పనులు చేపట్టారు. నిర్మాణ సమయంలో ఏ అధికారి పనులు పర్యవేక్షణ చేయకపోవడంతో అస్తవ్యస్తంగా పూర్తి చేశారు. అధికారులు స్పందించి ఇప్పటికైనా కాలువను పునరుద్ధరించాలి.

– ఎస్‌కె హమీద్, ఇంద్రానగర్ కాలనీ

నిలుస్తున్న మురుగు నీరు



కాలువ నిర్మాణం కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా చేపట్టడంతో మురుగు నీటితో ఇబ్బందులు పడాల్సి వస్తుంది. కాలువ అడుగు భాగంలో సీసీ వేయకుండానే వదిలేశారు. ప్రస్తుతం మురికి నీరంతా ఎక్కడికక్కడ నిలిచిపోతుంది.

– ఎస్‌కె జులేక, ఇంద్రానగర్ కాలనీ

మా గల్లీలోనూ నిర్మించాలి



కాలనీ వెలసి దశాబ్దాలు గడుస్తున్నా మా గల్లీలో ఇప్పటివరకు మురికి కాలువ నిర్మాణం చేపట్టలేదు. ఇటీవల పక్క గల్లీలో పాత కాలువలు తొలగించి కొత్తగా నిర్మిస్తుండడంతో మా కాలనీల్లో నిర్మించాలని నిరసన చేపట్టాం. నాలాలు నిర్మిస్తామని అధికారులు హామీ ఇచ్చి 5 నెలలు కావస్తున్నా చర్యలు తీసుకోలేదు.

– చునార్‌కార్ రాజేశ్వర్, ఇంద్రానగర్ కాలనీ

అటెన్షన్ ప్లీజ్.. అసంపూర్తిగా వంట గది



కెరమెరి: మండలంలోని నిషాని పాఠశాలలో వంట గది నిర్మాణం నిలిచిపోయి ఐదేళ్లు గడుస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. వంటగది నిర్మాణానికి నిధులు విడుదల కాకపోవడంతో సదరు గుత్తేదారు నిర్మాణం మధ్యలో నిలిపివేశారు. అధికారులు తక్షణమే స్పందించి నిధులు విడుదల చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సంబంధిత అధికారి: కుడ్మెత సుధాకర్, ఎంఈవో, కెరమెరి ఫోన్ నంబర్ : 9492970117

అనాథలను ప్రభుత్వమే ఆదుకోవాలి



మాట్లాడుతున్న కేశవరావు

ఆసిఫాబాద్‌రూరల్: తల్లిదండ్రులను కోల్పోయిన అనాథ పిల్లలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు రేకుంట కేశవరావు అన్నారు. ఆదివారం మండలంలోని అంకుసాపూర్‌లో అనాథ పిల్లలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా మహమ్మారితో తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలు తినడానికి తిండి లేక పౌష్టికాహారలోపంతో అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. అనాథ పిల్లలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని కోరారు. పిల్లలకు ఒక్కొక్కరికి రూ.10 లక్షలు, ప్రతీనెల 10 కిలోల రేషన్ బియ్యం, వారి సంరక్షకులకు అంత్యోదయ రేషన్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పిల్లల చదువులకయ్యే ఖర్చులను ప్రభుత్వాలే భరించాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు తానుభాయ్, మల్లక్క, అనాథ పిల్లలు తదితరులు ఉన్నారు.

ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ



జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

కౌటాల: ఎమ్మార్పీఎస్ జెండాను మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ జిల్లా మాజీ అధ్యక్షుడు పిట్టల సత్యనారాయణ, మండలంలోని తలోడి గ్రామంలో ఎమ్మార్పీఎస్ గ్రామ అధ్యక్షుడు గొడిసేల కరుణాకర్, ఎమ్మార్పీఎస్ నాయకులు ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ ఎస్సీలలోని 59 ఉపకులాలకు సమాన న్యాయం జరగాలనే ఉద్దేశంతో ఎమ్మార్పీఎస్ ఆవిర్భవించిందన్నారు. పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ప్రతీ ఏటా జనవరి 1వ తేదీన కౌటాల, తలోడిలలో జెండా ఆవిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మార్పీఎస్ నాయకులు దుర్గం బానయ్య, దేవయ్య, సురేష్, సంతోష్, విఠల్, మల్లేష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను విజ్ఞానవంతులు చేయాలి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సక్కు



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎస్పీ సురేష్‌కుమార్

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థులను విజ్ఞాన వంతులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని ఎమ్మెల్యే ఆత్రం సక్కు, ఎస్పీ సురేష్ కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి అన్నారు. ఆదివారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం, ఎస్పీ కార్యాలయం, జెడ్పీ చైర్‌పర్సన్ నివాసంలో వేర్వేరుగా పీఆర్‌టీయూటీఎస్ సంఘం నాయకులతో కలిసి నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బోలోపేతం కోసం కృషి చేస్తామన్నారు. జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి ప్రకాష్, చైతన్య, రమేష్, శ్రీనివాస్, కమలాకర్ ఉన్నారు.

సమ్మక్క జాతర నిర్వహణకు ఏర్పాట్లు



మాట్లాడుతున్న కమిటీ అధ్యక్షుడు తుమ్మ రమేశ్

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని నందిగూడ గ్రామ సమీపంలో నిర్వహించే సమ్మక్క సారలమ్మ జాతరకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కమిటీ అధ్యక్షుడు తుమ్మ రమేశ్ తెలిపారు. ఫిబ్రవరి 1, 2, 3, 4 తేదీల్లో జరిగే జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కమిటీ కార్యదర్శి పోలోజు శ్రీనివాస్, నాయకులు అవదూత శ్రీనివాస్, మంద రాజయ్య, కోట శంకర్, దొంతమల్ల వెంకటేశ్, పిర్సింగుల శ్రీనివాస్, బొమ్మెల్ల వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

చేతి పంపు మోటార్ ప్రారంభం



బోర్‌వెల్ మోటార్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సక్కు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని దస్నాపూర్‌లో న్యూలైఫ్ ఆఫ్ గాడ్ చర్చిలో ఆదివారం రూ. 25 వేలతో ఏర్పాటు చేసిన బోర్‌వెల్ మోటార్‌ను ఎమ్మెల్యే ఆత్రం సక్కు, జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్ రావు, సింగిల్‌విండో చైర్మన్ అలిబిన్‌అహ్మద్, గంధం శ్రీనివాస్, అబ్దుల్లా, పాస్టర్ కరుణకుమార్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సీఐటీయూ మండల కమిటీ ఎన్నిక



నూతన మండల కమిటీ

చింతలమానెపల్లి: సీఐటీయూ మండల కమిటీని ఆదివారం మండలంలోని బాలజీ అనుకోడ గ్రామంలోని రైతువేదికలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కన్వీనర్ డి.విలాస్, కో కన్వీనర్ అగాడి మంగళ, సభ్యులుగా అనురాధ, హంస, రవి, శంకర్, మారుతి, భీమయ్య, శివాని, తారాబాయిలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్, అంబాల ఓదెలు, కృష్ణాచారి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలో నూతన సంవత్సర వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని గుంటూరు కాలనీలో సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప తన నివాసంలో వివిధ సంఘాలు, అధికారుల సమక్షంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ కరుణాకర్, టౌన్ ఎస్‌హెచ్‌వో రవీందర్, ఎస్సై చంద్రశేఖర్, డివిజన్ పరిధిలోని ఎస్సైలు, అటవీ డివిజన్ అధికారి విజయ్‌కుమార్, కాగజ్‌నగర్ ఇన్‌చార్జి రేంజ్ అధికారి వేణుగోపాల్, పోశెట్టి, ఇసాఖ్, గిరిజన ఉపాధ్యాయ సంఘాల నాయకులు, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి షేక్ మహమూద్, మైనార్టీ గురుకులం బాలుర ప్రిన్సిపాల్ జబ్బార్ తదితరులు ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛాలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

దహెగాంలో..

దహెగాం: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో నూతన సంవత్సర వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. 2022వ సంవత్సరానికి వీడ్కోలు పలికి 2023 సంవత్సరానికి స్వాగతం పలికారు. రాత్రంతా ఆడిపాడి కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఇళ్ల ముందు రంగు రంగుల ముగ్గులు వేశారు.

కౌటాలలో..

కౌటాల: మండలవాసులు ఆదివారం నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేకులు కట్ చేసి 2023 వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. న్యూ ఇయర్ సందర్భంగా కౌటాలలోని చికెన్, మటన్, చేపల సెంటర్‌లు ప్రజలతో రద్దీగా కనిపించాయి. కార్యక్రమాల్లో నాయకులు, భక్తులు పాల్గొన్నారు.



దహెగాం: సంబరాలు జరుపుకుంటున్న ప్రజలు



కాగజ్‌నగర్‌టౌన్: ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న పోలీసు అధికారులు

రెబ్బెనలో..

రెబ్బెన: మండల వాసులు ఆదివారం నూతన సంవత్సర వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. గడిచిన సంవత్సరానికి వీడ్కోలు, కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ కేకులు కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. గోలేటి టౌన్‌షిప్‌లో రెబ్బెన సీఐ అల్లం నరేందర్, ఎస్సై భూమేష్‌లు మండల జర్నలిస్టులతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు.

వేడుకల్లో ఎమ్మెల్సీ దండె విఠల్

మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు ఏర్పాటు చేసిన నూతన సంవత్సర వేడుకలకు ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండె విఠల్ హాజరయ్యారు. కేక్ కట్ చేసి నాయకులకు తినిపించారు. ఎంపీపీ సౌందర్య, జెడ్పీటీసీ సంతోష్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు సోమశేఖర్, కోఆప్షన్ సభ్యుడు జహురొద్దీన్, నాయకులు అన్నపూర్ణ మురళీగౌడ్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



రెబ్బెనలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్సీ దండె విఠల్



గోలేటిలో వేడుకల్లో పాల్గొన్న సీఐ అల్లం నరేందర్, ఎస్సై భూమేష్



కౌటాల: కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ విశ్వనాథ్, నాయకులు

కాలం మారింది..!





ఒకప్పుడు కొత్త సంవత్సరం వస్తుందంటే వారం, పది రోజుల ముందు దుకాణాల్లో రకరకాల గ్రీటింగ్ కార్డులు దర్శనమిచ్చేవి. దూరంగా ఉన్న ఆత్మీయులకు శుభాకాంక్షలు తెలిపేందుకు గ్రీటింగ్ కార్డులు కొనుగోలు చేసి పోస్టు ద్వారా పంపేవారు. ప్రస్తుతం గ్రీటింగ్ కార్డుల వాడకం చాలా వరకు తగ్గిపోయింది. పాఠశాలల్లోని విద్యార్థులు మాత్రమే గ్రీటింగ్ కార్డులు వాడుతున్నారు. కాగా యువత ఎక్కువగా యూట్యూబ్, వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్, మెయిల్స్ ద్వార విభిన్న రకాల గ్రీటింగ్ స్టిక్కర్లతో శుభాకాంక్షలు తెలుపుతున్నారు. రాజకీయ నాయకులు విభిన్న స్టిక్కర్లను సిద్ధం చేసుకుని గ్రూప్‌లల్లో పోస్ట్ చేస్తూ ప్రజలకు శుభాకాంక్షలు తెలపడంతో పాటు తమ ఉనికిని చాటుకుంటున్నారు.

– కెరమెరి